# శిల్పం

ఢిల్లీకి అదే రావడం, సాయంత్రం ఒంటరిగా దూరం వెళ్ళే సాహసం లేక అర్జున్ విహార్ క్వార్టర్స్ నుండి బయలుదేరి మందిర్ మార్గ్‌లో ఇటూ అటూ తిరిగేవాణ్ణి. పలుకరించే మనిషి ఉండడు. పరిచయమైన భాష వినపడదు. విశాలమైన రోడ్లు. దానికి రెండువేపులా నిశ్చింతగా నడచిపోగల పేవ్‌మెంట్లు, ఎత్తయిన పచ్చని చెట్లు రంగు రంగుల మోటారుకార్లూ, సరికొత్త నమూనా కార్లూ బాణాల్లా రోడ్డు మీద దూసుకుపోతూ వుంటాయి. కానీ, రోడ్లమీద నడిచే మనుష్యులే పల్చగా ఉంటారు. శరీరం బరువు తగ్గించుకోవాలన్న ఆరాటంతో నడకలాటి పరుగూ, పరుగులాటి నడకతో సంచరించే ఆర్మీ అధికారులు వారి ఆలుబిడ్డలూ కాక, ఎండి రాలిన క్రాకంపా పోగు చేసి తలమీదో, సైకిలు మీదో పెట్టుకుపోయే సామాన్యులు అక్కడక్కడ కనిపిస్తారు.

ఒక సాయంత్రం హనుమాన్ మందిర్ ద్వారానికి దగ్గరగా బెంచీ ఉంటే వెళ్ళి కూర్చున్నాను. కాస్తంత దూరాన ఇంకో బెంచీ మీద తెల్లని కుర్తా పైజమాలో ఒక బట్టతల వాడు కూర్చొని రోడ్డుకి అవతల వైపున మోకాళ్ళ మీద కూర్చున్న వాడి వేపు నిశితంగా చూస్తున్నాడు. తల మోకాళ్ళ మీద ఆనించి వెన్ను వంచి ఎందుకు కూర్చున్నాడో నాకు అర్థం కాలేదు. పదినిముషాలైన తర్వాత బట్టతల వాడు లేచి నిలబడి రోడ్డు దాటాడు.

"క్యా హోగయా ? తబీయత్ ఠీక్ హైనా ?" అన్నాడు.

వాడు లేచి నిలబడి "కుచ్ నహీ సాబ్. ఏ గఠరీ ఉఠానే కేలియే కిసికీ మదద్ చాహియే ........" అని ఇటూ అటూ బేలగా చూస్తున్నాడు. అరవై డెబ్బై మధ్య వయసువాడు. నల్లని ఛాయ. వాడి ప్రక్కనే ఎండు కట్టె పుల్లలు పేర్చి కట్టిన మోపు ఉంది. మోపు పెద్దది కాదు. కానీ ..... వాడంతట వాడు తలకెత్తుకో గలిగినట్టు లేదు. ఆమోపును వాడి తల మీదకు ఎత్తి తిరిగి బెంచీ మీదకు రాకుండా తెల్లదుస్తులవాడు పోలో రోడ్డు వేపు మళ్లి ......... సాగిపోయాడు. నేనూ అర్జున్ విహార్ చేరుకున్నాను.

రెండు రోజుల తర్వాత ఇక సాయంకాలం మందిర్ మార్గ్‌తో విసుగెత్తి, పోలో రోడ్డులోకి వెళ్ళి ఎడమ ప్రక్కకు మళ్ళాను. నాకు ఎదురుగా వచ్చిన బట్టతల వాడు నన్ను చూస్తూ ఆగి "మీరు రమణరావుగారుకదూ !" అన్నాడు.

నేను సాలోచనగా నిలబడిపోతే 'నేనూ ముకుందాన్ని. మీ ఆఫీసులో నే పనిచేశాను. మూడేళ్ళయింది రిటైరయ్యి. ఇప్పుడు నా కొడుకు దగ్గర ఉంటున్నాను" పరిచయం చేసుకున్నాడు.

"ఎక్కడ ?"

"ఈ రోడ్డు చివరగా పోతే ఒక పెద్ద ఎన్‌క్లేవ్ ఉంది. అందులో కుడివేపు చివరి బ్లాక్‌లో నాల్గో అంతస్తు. ఇంకా ఉంటున్నారుగా. రండి మాట్లాడుకుందాం".

"నా అల్లుడు ఒక నెల కుప్వాడా టెంపరరీ డ్యూటీ మీద వెళ్ళవలసి వచ్చింది. కూతురు ఏదో పరీక్షలకు చదువుతోంది. రమ్మంటే నెల రోజులు శలవు మీద వచ్చాను" అని క్లుప్తంగా చెప్పి నా దారిన పోయాను.

ఏదో మాటవరసకి అడిగాను. - 'ఎక్కడ ?'అని. నిజానికి వాడి నివాసానికి వెళ్ళే ఉత్సాహం లేదు. ముకుందాన్ని గుర్తు తెచ్చుకునే ప్రయత్నం చేస్తూ పోతున్నాను. మూడువేల మంది ఉద్యోగస్థులలో ఒకడై ఉంటాడు. నా క్రిందనున్న ఏ విభాగంలోనూ పనిచేసిన జ్ఞాపకం లేదు. కాని, ముకుందం అన్న పేరు మాత్రం పరిచయమైనదే. ఎలా ? ఎక్కడ ?

మెదడులో పరాకు పొరలు విడి, దీపం వెలిగినట్లయింది. ఆ పేరు మా ఆఫీసులోని టెన్నిస్ కోర్టుతో ముడిపడింది. ఆ టెన్నిస్ కోర్టుకి పెద్ద చరిత్రే ఉంది. ఎప్పుడో నైజామ్ జమానాలో సాయంత్రం అధికారులతో దీపాల వెలుగులో కళకళలాడేదని అంతా చెప్పుకునేవారు. ఆ తర్వాత కళ తప్పింది. నే చేరిన కొత్తలో మధ్యాహ్నం విశ్రాంతి వేళ అంతా చేరి లంచ్ బాక్సులు తెరిచి ఆ కోర్టు మధ్యలో కూర్చుని ముచ్చటలాడుకొనే వాళ్ళం.

చాలా రోజుల తర్వాత ఒక కేరళ ప్రాంతీయుడు ఆల్ ఇండియా సర్వీసెస్‌లో సీనియర్ అధికారిగా వచ్చి మా ఆఫీసుకి అధిపతి అయ్యాడు. అతని ప్రోత్సాహం, పలుకుబడితో మళ్ళీ కోర్టులో వెలుగు నింపాడు. ప్రారంభంలో పెద్ద ఆఫీసర్లూ, ప్రొబెషనర్లు మాత్రమే ఆడినా, క్రమంగా ఛోటా శ్రేణి ఆఫీసర్లు కొందరు సాహసించి రేకెట్లు పట్టుకున్నారు. కానీ ఉన్నత హోదా వాళ్ళు బదిలీ అయి వెళ్ళిపోయాక కోర్టు వెల వెల పోయేది. అలాటి కష్ట సమయంలో కొందరు నిజమైన ఉత్సాహం ఉన్నవాళ్లు అరడజనుమంది చేరి తలకో ఐదో పదో చేతినుండి పెట్టుకొని జీవం నిలిపేవారు. నెట్ కట్టడానికి బంతులివ్వడానికీ ఇద్దరు కుర్రాళ్ళను పెట్టుకుని దీపాలు వెలగకపోయినా చీకటి పడేదాకా ఆడుకునే వారు. ఆటమీద ప్రేమ ఉన్న అధికారుల రాక కోసం నిరీక్షించేవారు.

అలాటి అరడజను మందిలో ముకుందం ఒకడు. కానీ, నేను ఎన్నడూ ఆ కోర్టు దరిదాపులకు పోయేవాడిని కాదు. అయితే ఏవైనా టోర్నమెంట్స్ జరుగుచున్నప్పుడూ, పెద్ద ఆఫీసర్లు ఆడుతున్నప్పుడు కోర్టు చుట్టూ జనాలు ఈగల్లా ముసిరి ఎగబడి చూస్తూ వుంటే ఇంటికి పోతూ పోతూ నేనూ రెండు నిముషాలు తొంగి చూసేవాడిని. ముకుందం 'అలాకొట్టు- చంపు' అంటూ హుషారెక్కించే అరుపుల్లో ముకుందం ముఖం నాకు పరిచయమైంది. అప్పట్లో నల్లని తుప్ప తలతో ఉండేవాడు. ఈ బట్టతల రిటైర్ అయ్యే ముందు వచ్చి పడినట్టుంది. వేళకు నేను ఇంటికిపోయి, ఒక్కొక్క డిపార్ట్‌మెంటల్ టెస్టూ పాసయి అధికారపు పోటీలో ఉంటే తాను ఏదో నవలో పుస్తకమో చేతిలో పట్టుకుని టెన్నిస్ ఆడుతూ నిష్పూచీగా కనుపించేవాడు.

హోదా - అంతస్తు కారణంగా మొదట బెట్టు చూపే ఆఫీసర్లు కూడా నాలుగురోజుల్లో తరతమ భేదాలు మరచిపోయి 'ముకుందం' అని కలవరించి నెట్టుకి అవతల వేపు నిలబెట్టి ఆడుకునేవారు. ఇద్దరు అమ్మాయిలు ప్రొబేషనర్లుగా వచ్చి టెన్నిస్ ఆడాలని ఆరాటపడి అడ్డానికి బిడియపడుతూ వుంటే ఆ బెరుకు వదిలించి, కోచ్ లా సహనంతో వాళ్లకెదురుగా ఆడి అందరి కళ్ళలో ఒక హీరోలాగ మెదిలేవాడు.

❋ ❋ ❋

అల్లుడు కుప్వాడా వెళ్లి మళ్ళీ వచ్చేశాడు. నా శలవు కూడా అయిపోవచ్చింది. ఇక రెండు మూడు రోజుల్లో హైదరాబాద్ వెళ్ళిపోతాననగా ఒక సాయంకాలం పోలో రోడ్డులోంచి ఎడమవేపుకి తిరిగిపోతూ ఉంటే ముకుందం చెప్పిన ఎన్క్లేవ్ నా కళ్ళపడింది. ఏమీ తోచని సమయంలో అనాలోచితంగా ఏదో చేస్తాం. అలా నేను ముకుందం చెప్పిన కొండ గుర్తులు గుర్తుకు తెచ్చుకొని వెళ్ళి డోర్ బెల్ మ్రోయించాను. అతనే తలుపు తెరచి ఎంతో ఆప్యాయంగా లోనికి తీసుకువెళ్లాడు. డ్రాయింగ్ రూమ్ చూస్తూనే ఆశ్చర్యపోయాను. ఎక్కడ చూసినా మెరిసిపడే మోమెంటోలూ, గోడలకు పెద్ద వర్ణ చిత్రాలు. ఎవరివి ఇవన్నీ అని అడిగాడు. "ఈ వర్ణ చిత్రాలన్నీ నా కోడలు వేసినవే ఈ మెమెంటోలు నా కొడుకూ కోడలివి. నావి కావు" అన్నాడు తేలికగానవ్వుతూ.

"కొడుకూ కోడలూ ఏం చేస్తున్నారు?" అడిగాను.

"మా వాడు మాల్‌రోడ్ దగ్గర రక్షణశాఖ పరిశోధక సంస్థలో క్లినికల్ సైకాలజిస్టు. కోడలు విద్యాభవన్ కాలేజీలో ఇంగ్లీషు చెప్తుంది. ఇవాళ ఏదో పార్టీ ఉందని ఇద్దరూ మనవణ్ణి తీసుకువెళ్ళారు. మనవడుంటే నాకు టి.వి. అందనివ్వడు. టెన్నీస్ పోటీ చూడాలి .... వాకింగ్ నుంచి కాస్త వేగమే వచ్చాను" అన్నాడు.

ఒక నేపాలీ యువకుడు రెండు కప్పులు వేడి టీ తెచ్చి మా ముందుంచాడు.

"అనుకోకుండా ఇలా కలిశాం. ఇవాళ మా ఇంటి భోజనం రుచి చూసి వెళ్ళండి" ప్రాథేయపడ్డాడు ముకుందం.

"మా పిల్లలు రాగానే చీకటైనా మేం దింపుతాం. మీ అమ్మాయి నెంబరు చెప్పండి. మీరు ఇక్కడ ఉన్నారని కంగారుపడవద్దనీ ఫోన్ చేస్తాను" అని ఒత్తిడి చేశాడు.

ఇన్నాళ్ళూ ఏమీ తోచక ఒంటరిగా రోడ్లు కొలుస్తూ ఉన్నాక ఈ మార్పు కాస్త రుచిగా తోచింది. ముచ్చటలు చెప్పుకుంటూ గతాన్ని నెమరవేస్తూ నేను కూడా సర్దుకు కూర్చున్నాను. టి.వీ. స్క్రీన్ మీద టెన్నిస్ ఆట మొదలవగానే ముకుందం కళ్ళల్లో ఏదో వెలుగు. ఇద్దరు అమ్మాయిలు నెట్‌కి అటూ ఇటూ రేకెట్లు ఊపుతూ నిలబడగానే ........ ఇంకా ముకుందం ఈ ఆట మీద చూపే క్రేజ్‌కు నవ్వు వచ్చింది.

ఆ చిన్న అమ్మాయి ఎవరో కాని, చూడముచ్చటగా ఉంది. రెండో పిల్లకన్నా కాసింత కురచగా ఉన్నా ఎంతో లేత వయసు ... అన్నాను. "ఆ రెండో అమ్మాయి కూడా ఏమంత పెద్దది కాదు. మూడేళ్ళు ఎక్కువ వయసు. సెర్బియా దేశపు అమ్మాయి. ఈ పోటీ దుబాయ్‌లో జరుగుతోంది. వీరిద్దరిలో గెలిచిన అమ్మాయి ఫైనల్స్‌లో ఆడాల్సి ఉంటుంది అని నాకు వివరించాడు ఉత్సాహంగా.

నాకు ఆ స్కోరూ అదీ అంతగా అర్థం కాకపోయినా ఆ చిన్న అమ్మాయిది హైదరాబాద్ అనీ, మనదేశం నుండి దుబాయ్ వెళ్ళి ఆడుతోందనీ ముకుందం చెప్పిన మీదట ..... సానుభూతి అంతా ఆమె మీదే ఉంది. నుదుటి మీద ముందుకు పొడుచుకువచ్చే తెల్లటి టోపీ, ఎడమవేపు ముక్కుకు మెరిసిపడే నత్తు, వెనక్కు దువ్వి క్లిప్పు పెట్టి విడిచిన జుట్టూ ......... ఎంతో చక్కగా ఆకర్షిస్తోంది. "అయితే ఈ ఆటలకు లక్షల్లో ఇందరు ప్రేక్షకులా ? ఎంత ధనం వ్యర్థమౌతోంది. ఏమిటీ వెర్రి?" అన్నాను.

ఆటను నిశితంగా చూస్తూ ....... నా ప్రశ్నలకు చిన్నాగా నవ్వాడు.

"ఆట చూడాలని ఇష్టం ఉన్నవాళ్ళు ఉంటారు. అంతేకాదు దుబాయ్ - మహమ్మదీయులుండే స్థలం. ఇండియన్స్ కూడా ఉద్యోగాల కోసం ఎక్కువ సంఖ్యలో వెళ్ళిన నగరం. ఈ చిన్నమ్మాయి మనదేశంలో ముస్లిమ్ కుటుంబానికి చెందినపిల్ల. మతపరమైన అభిమానమూ, దేశపరమైన సానుభూతీ బలమైన కారణాలు" అని ప్రేక్షకుల ఉత్కంఠకు విశ్లేషణ ఇచ్చాడు.

ఆట సాగుతోంది. చిన్నపిల్ల గేము గెల్చినా సర్వీస్ చేసినా విపరీతంగా ప్రోత్సహించిన ప్రేక్షకుల చప్పట్లు మారు మ్రోగుతున్నాయి. కానీ, రెండో అమ్మాయికి ఆమె చుట్టాలు, స్నేహితులూ, ఆ దేశస్థులూ గట్టిగా నలభైమందైనా లేనట్టు అనిపించింది. ఒక చిన్న శిబిరంలోంచి చప్పట్లు వినిపిస్తున్నాయి. పోటీ పూర్తి అవగానే నాకు అర్థమైపోయింది. మనదేశపు అమ్మాయి రెండు సెట్లూ వీగిపోయిందని. నేనూ ఎందుకో నిరాశపడ్డాను. ముకుందం మాత్రం ఆట జరుగుతున్నంత సేపూ ప్రతిబంతినీ తన కళ్ళతో వెంటాడుతూ ఆటలో లీనమై పోయాడు. ఆ సర్బియా అమ్మాయి బాగా ఆడుతోందని మెచ్చుకొంటూనే ఉన్నాడు. ఆ అమ్మాయి పేరు ఏమిటని అడిగాను.

"ఏలెనా ఎంకోవిచ్ అని పలకాలి" అన్నాడు. ఆట పూర్తి కావస్తున్న దశలో ప్రేక్షకుల కోలాహలం, చప్పట్లూ పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. అందరూ గంభీరంగా ఉన్నారు. ఇంతలో ఆ అమ్మాయి షీల్డు చేత్తో అందుకుంటూ చిరునవ్వుతో - "ఇప్పుడైనా క్లాప్స్ కొట్టండి" అంది.

ఆ మాట వింటూనే ముకుందం పరవశంతో చప్పట్లు చరిచాడు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. వింతగా అతని వేపు చూశాను. అతని జవాబు కూడా ఆలోచించేలా చేసింది. "ఆమె ఆడిన తీరులోనూ మాటలోనూ ఎంతో అందం ఉంది. ప్రేక్షకులు అంతా ఏక కంఠంతో చిన్నమ్మాయినే ప్రోత్సహిస్తున్నారనీ సెర్బియా అమ్మాయికి స్పష్టంగా తెలిసింది. అయినా ధైర్యం చిక్కబట్టి ఒంటరి పోరాటం చేసి గెలిచింది. నిజంగా మెచ్చుకోవలసిందే. ప్రేక్షకులు చూపుతున్న వివక్షపట్ల ఆమెలో ఎంత వేదన ఉందో ఆ పిల్ల షీల్డు అందుకుంటూ అన్న మాటలే చెబుతున్నాయి. ఆటని మెచ్చుకోవాలి. కానీ తమ పర భేదాలు అంతగా ప్రేక్షకుల్లో రాకూడదు. అందుకే యుద్ధాలు, ఘర్షణలూ, క్రూరత్వం ఇంకా మానవుల్ని పీడించి పిప్పి చేస్తున్నాయి" అన్నాడు ఆవేశంతో.

సరిగ్గా అదే సమయంలో ముకుందం కొడుకూ, కోడలూ, మనవడూ వచ్చారు. వాళ్ళని పరిచయం చేశాక నేనూ ముకుందం భోజనం ముగించాము. నేను

ఊరుకోలేక ఆటలంటే జనాల్లో ఉండే క్రేజ్ గురించి వ్యాఖ్యానించాను. "బోలెడు ధనాన్నీ కాలాన్నీ ఆటల పేరు మీద వృధా చెయ్యడం విడ్డూరంగా ఉంటుంది" అన్నాను.

నా ఆలోచన వినగానే ముకుందం కొడుకు నవ్వుతూ కలగజేసుకొని, ఎదురుగా కూర్చుని నాతో మాటలు కలిపాడు.

"ఈ ఆటల్ని అలా సులభంగా తీసి పారేయకండి అంకుల్" అన్నాడు. ఏం చెప్తాడో అని శ్రద్ధగా వింటున్నాను.

"ఈ ఆటల వెనుక పెద్ద చరిత్రే ఉంది. మనిషి సులభంగా అర్థం కాడు. వాడు ఎంత మంచివాడో అంత క్రూరుడు. సామ్రాజ్యం నిర్మించగలడు. సర్వనాశనం చెయ్యగలడు".

ఆటలకీ ఈ మాటలకీ సంబంధం ఏమిటా అని చెవులు అప్పగించి వింటున్నాను.

"రోమన్స్ ఇద్దరు యోధుల మధ్య పోటీ పెట్టి, రెచ్చగొట్టి ఆ ఇద్దరూ కత్తులతో దూసుకొని రక్తసిక్తమైపోతూ ఉంటే వికృతంగా వినోదించేవారు. ఆ వినోదంలో రాజులూ చక్రవర్తులూ కూడా పాలు పంచుకునే వారు. ఒక బిషప్పు ఈ అమానుషానికి బాధపడి తట్టుకోలేక ఇద్దరు యోధుల మధ్యకు దూకి విడదియ్యబోయి కత్తులకు బలైపోయాడు. ఆ తర్వాత క్రమంగా చక్రవర్తుల్లో కూడా పరివర్తన వచ్చి ఈ వినోదాన్ని నిషేధించారు".

ఈ మాటలు వింటూ నేను ఇంకా ఆశ్చర్యపోతున్నాను. ఆ సైకాలజిస్టు ఏం చెప్పబోతున్నాడని.

"ప్రమాదవశాత్తు ఇంటికో ఒక వీధికో నిప్పు అంటుకు మండుతూ ఉంటే ఆ అసాధారణమైన దృశ్యాన్ని నోరు తెరచి, కళ్ళు అప్పగించి చూసే వాళ్ళు వందల్లో ఉంటారు. కానీ ప్రమాదంలో ఇరుక్కున్న వాళ్ళని వెలికి తీయడంలోనూ మంటలార్పడంలోనూ సాసించిన వాళ్ళు కొద్దిమందే ఉంటారు. ఒంటెల మీద

చిన్న పిల్లల్ని కట్టి పరుగుపందాలు పెట్టి ఆనందించడం మీరు వినే వుంటారు.

కొందరు చిన్నపిల్లలు కుక్కపిల్ల తోకను లాగి అది కుయ్యోమని అరుస్తూ వుంటే ఆనందిస్తారు. ఇదొక విచిత్రమైన విషయమే. మనిషిలో కొంత వికృతమైన క్రూరత్వం ఉంటుంది. విధ్వంసకరమైన ఉత్సాహం ఉంటుంది. అలాటి ఉత్సాహ కారణంగా జరిగే క్రూరమైన క్రీడలనూ, యుద్ధాలనూ దారి మళ్ళించడానికి ఇలాంటి ఆటలు కొంత మేలు చేస్తున్నాయనే చెప్పాలి''.

ముకుందం ఆ సెర్బియా అమ్మాయి పక్షంగా చూపించిన సానుభూతీ, ప్రేక్షకుల ప్రవర్తన పట్ల ఆవేదనా ఎందుకో ఇప్పుడు కాస్త అర్థమౌతోంది. ఆటలు గురించి చెప్తున్న ముకుందం కొడుకు ఇలా తన థియరీని ముగించాడు.

''మృగప్రాయంగా ఉన్న మనిషి తరతరాలుగా తన శిల్పాన్ని తానే చెక్కుకుంటూ, నునుపు చేసుకుంటూ సౌందర్య సృష్టికి ఎంతో శ్రమ పడుతున్నాడు. ఆ ప్రయత్నంలో మరి ఈ ఆటలు అవసరమేమో ! యుద్ధాలు కూడా వద్దని మానుకోగల సంస్కారం ఏనాటికి వస్తుందో.''

నన్ను తండ్రీ కొడుకూ కారులో మా అమ్మాయీ అల్లుడూ ఉండే క్వార్టర్స్ దగ్గర దింపి చేతులూపుతూవుంటే నా కంటే ఎత్తుగా కనిపించారు. నేను ఎరగని క్రొత్త ప్రపంచాన్ని తొంగి చూశాను ఆవిధంగా.

✣ ✣ ✣

*నవ్య 31-8-2005*

✣ ✣ ✣